# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.
- ❖ ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 2 వేల 777 రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ రాష్ట్రంలోని ఓర్వకల్లు, కొప్పర్తిలలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ నూజివీడు ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల అనారోగ్యానికి గల కారణాలపై విచారణకు మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు.
- ❖ ఉత్తర బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

==================================

రాష్ట్రానికి సంబంధించి కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ కు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అమరావతిలోని సచివాలయంలో కొద్ది సేపటి క్రితం జరిగిన పాత్రికేయుల సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు, పరిశ్రమలకు సంబంధించి రెండు నోట్స్‌ను కేంద్ర ప్రభుత్వం క్లియర్ చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియచేశారు. కాగా, పోలవరం ప్రాజెక్టుకు 12 వేల 127 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే, పోలవరాన్ని 2027 మార్చిలోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు.

=================================

రాష్ట్రంలో కొత్తగా 2 వేల 777 రేషన్ షాపుల ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలను తీసుకున్నారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రద్దు, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ, పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణ వంటి వాటికి మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. అదే విధంగా మున్సిపాలిటీల్లో 269 సూపర్ న్యూమరీ పోస్టుల భర్తీకి కూడా ఆమోదం తెలిపింది. ఆ వివరాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలియజేస్తూ......

(వాయిస్ 35 సెకన్లు)

=================================

రాష్ట్రంలోని ఉమ్మడి కర్నూల్ జిల్లాలోని ఓర్వకల్లు, వైఎస్సార్ జిల్లాలోని కొప్పర్తిలకు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు మంజూరయ్యాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఈ మేరకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. అదే విధంగా హైదరాబాద్ - బెంగళూరు, విశాఖ - చెన్నై కారిడార్లని కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని అన్నారు. రాష్ట్రానికి వివిధ రకాల పరిశ్రమలు రావడానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=================================

ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటిలో చదువుతున్న విద్యార్థులు అనారోగ్యం బారినపడడంపై రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. ట్రిపుల్ ఐటి రిజిస్ట్రార్ సహా ఇతర అధికారులతో మాట్లాడి విద్యార్థులకు ఏవిధమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని కోరారు. అనారోగ్యానికి గల కారణాలపైన విచారణ జరిపి సమగ్రమైన నివేదికను తక్షణం అందించాలని ఆదేశాలు జారీ చేసారు. కాగా, మంత్రి ఆదేశాలు మేరకు ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శర్మిష్ట నూజివీడు ట్రిపుల్ ఐటి కి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉండగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు జ్వరం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

=================================

ఉత్తర బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ తరువాత రెండు రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిస్సా, ఉత్తరాంధ్ర తీరాల సమీపంలోకి చేరే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఈ నెల 31వ తేదీ నుంచి రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా రానున్న రెండు రోజులలో అనేక జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

=================================

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వైద్య కార్యక్రమాలతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రంలో మెరుగైన వైద్య సేవలను అందిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఉత్తర వీధి ముఖద్వారాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో

మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ పథకాన్ని రద్దు చేస్తామన్న ప్రచారం తప్పు అని స్పష్టం చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామన్నారు.

విరామం

==================================

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వారితో ప్రమాణం చేయించారు. ఇప్పటి వరకు వీరిద్దరూ అదనపు న్యాయమూర్తులుగా ఉన్నారు. వారిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని, ఈ నెల 13వ తేదీన సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇటీవల ఆమోదం తెలిపారు.

==================================

విశాఖ జిల్లాలోని అన్ని లే-అవుట్లలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి గృహ నిర్మాణ పనులు జరగాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత గుత్తేదారులు, అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో 100 రోజుల్లో 70 వేల గృహాలు పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, జిల్లాలో ఇసుక కొరత లేదని, సిమెంట్ సమస్య కూడా తీరబోతుందని కలెక్టర్ వెల్లడించారు.

==================================

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విజయనగరం పార్లమెంటు పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల చెకింగ్, రీవెరిఫికేషన్ ప్రక్రియను ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించామని విజయనగరం ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు బొత్స అప్పలనరసయ్య, బెల్లాన చంద్రశేఖర్ ఇ.వి.ఎం.ల చెకింగ్, రీవెరిఫికేషన్ కోసం ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేశారని ఆయన పేర్కొన్నారు.

==================================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ పాఠశాలలో పలు మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని నెల్లూరు లోక్ సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జుయెల్ ఓరం ఆదేశాల మేరకు తాను ఏకలవ్య మోడల్ పాఠశాలలను సందర్శించానన్నారు. అలాగే రాష్ట్రంలో 26 ఏకలవ్య మోడల్ స్కూల్ లను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.

==================================

విశాఖపట్నం- అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం- నాందేడ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ జత రైళ్లకు సెప్టెంబరు 3వ తేదీ నుంచి అదనపు బోగీలను అమరుస్తున్నామని తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు రైళ్లకు ప్రయాణీకుల నుంచి వున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. స్లీపర్ క్లాస్ అలాగే 3 AC ఎకానమీ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన నడుపుతున్నామని తెలిపారు.

==================================

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్ లైన్ లో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలలో పాల్గొనేందుకు డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయా క్రిష్ణన్ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను ఈ రోజు జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒక కళాశాల నుండి ఎంతమంది విద్యార్థులైనా ఆన్ లైన్ లో  దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

==================================

విశాఖలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయంలో స్వామివారి నిత్య కల్యాణం ఈ రోజు వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

==================================

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో సెప్టెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

==================================
==================================